క్లుప్తంగా

కనిగిరిలో గ్రీవెన్స్

దొనకొండ: కనిగిరి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్, పలు శాఖలకు సంబంధించిన అధికారులు హాజరవుతారని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దొనకొండ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఒంగోలు వెళ్లకుండా కనిగిరిలో నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలపై అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

అశోక్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



అశోక్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరంలో వైఎస్సార్ సీపీ యువనాయకుడు మాదిరెడ్డి అశోక్‌రెడ్డి(30) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయన మృతదేహాన్ని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్ కాసు భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వీరగంధం కోటయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి నాగిరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్‌కుమార్, నారు శ్రీనివాసులురెడ్డి, కండె గంగయ్య, కర్నాటి వెంకటరెడ్డి, అన్నెం అమర్‌నాథ్‌రెడ్డి, రమణారెడ్డి, పందుగుల చెంచిరెడ్డి పాల్గొన్నారు.



త్రిపురాంతకం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు



త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు ఇది

స్వచ్ఛత డొల్ల.. పారిశుద్ధ్యం కల్ల

- అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద పారిశుద్ధ్యం
- ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు ఇక్కడే
- పరిసరాల్లో మురుగునీరు నిలిచి బురదమయం

త్రిపురాంతకం: స్వచ్ఛ ఆంధ్ర అని ఓ పక్క ప్రభుత్వం ఊదరగొడుతుంటే ప్రభుత్వ కార్యాలయాల వద్దే పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. త్రిపురాంతకం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద వర్షం నీరు నిలిచి అధ్వానంగా ఉంది. లోపించిన పారిశుద్ధ్యంతో కార్యాలయాలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. వరాహాల సంచారం, దోమల స్వైర విహారం కార్యాలయాల చుట్టూ పరిస్థితులకు అద్దంపడుతోంది. మరి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రాంతంలోనే ఇలా ఉంటే ఇక మండలంలోని గ్రామాల్లో పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

మందుబాబులకు అడ్డా..

ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనాలు మద్యం తాగేవారికి అడ్డాగా మారాయి. సాయంత్రం కార్యాలయాల పనివేళలు ముగిశాక.. వాటి పరిసరాల్లోనే మందుబాబులు దిష్టవేసి మద్యం తాగుతున్నారు. దీంతో కార్యాలయాల ఆవరణల్లో ఎక్కడ చూసినా తాగి పడవేసిన లిక్కర్ ఖాళీ సీసాలు, డిస్పోజబుల్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ దర్శనమిస్తున్నాయి.

అధికారులకు సైతం ఇది చాలా ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం లోనే ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. విద్యార్థులకు కూడా ఇది ఇబ్బందికరంగానే ఉంటోంది. ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



త్రిపురాంతకం ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగి పడేసిన లిక్కర్ సీసాలు, గ్లాసులు, బాటిల్స్ తొలగిస్తున్న మహిళ



త్రిపురాంతకం స్త్రీ శక్తి భవనం వద్ద వరాహాల సంచారం



త్రిపురాంతకం ఎస్సీ కాలనీ సముదాయంలో గృహాల మధ్య నిలిచిన నీరు

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులా?



డిజిటల్ బుక్ యాప్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- రెడ్ బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచకాలు
- బాధితులకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్ ప్రారంభం

యర్రగొండపాలెం: ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తున్నారని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన పెద్దలు వాటిని విస్మరించి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిజిటల్ బుక్ యాప్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి రెడ్ బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టించారని, పోలీసులను అడ్డుపెట్టుకొని తమ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లు అమలు చేసేశామంటూ గ్లోబల్ ప్రచారం చేసుకుంటూ చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు తిరుగుతున్నారని, అవి ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయించడమే కాకుండా కుటుంబ సభ్యులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని, ఎక్కడైనా అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో నమోదవుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని తామందరం సద్వినియోగం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పుల్లలచెరువు, పెద్దారవీడు మండలాల పార్టీ కన్వీనర్లు దోమకాల వెంకటేశ్వర్లు, పాలిరెడ్డి కృష్ణారెడ్డి, త్రిపురాంతకం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.ఓబులరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, వై.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.అరుణాబాయి, పల్లె సరళ, ఎనిబెర శార, షేక్.ఎక్షావలి, గుండారెడ్డి రమణారెడ్డి, శంబిరెడ్డి, మార్తల సుబ్బారెడ్డి, జానకి రఘు, కోటిరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, సూరె శ్రీనివాసులు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్ కుమార్, పి.రాములు నాయక్, బి.బాలచెన్నయ్య, డి.శ్రీనివాసరెడ్డి, వెన్నా మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయానికి గ్రానైట్ రాళ్లు వితరణ

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో గంగా పర్వతవర్థిని సమేత సోమేశ్వరస్వామి దేవాలయానికి పూజారి నుదురుపాటి రమణయ్య రూ.60 వేల విలువైన గ్రానైట్ రాళ్లు, నాపరాళ్లు విరాళంగా అందజేశారు. ఆలయానికి వస్తు రూపంలో విరాళం అందించిన పూజారిని గ్రామస్తులు అభినందించారు.



అలయ ప్రాంగణంలో నాపరాళ్లు అమర్చుతున్న దృశ్యం



వైపాలెంలో అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న మహిళా భక్తులు



తూర్పుగంగవరంలో చండీ హోమంలో పాల్గొన్న దంపతులు

మహాచండిదేవిగా కనకదుర్గమ్మ



వైపాలెంలో పార్వతీదేవి అలంకరణలో దర్శనం ఇస్తున్న వాసవీ అమ్మవారు



దర్శి : మహాచండీదేవిగా దర్శనం ఇస్తున్న కనకదుర్గమ్మ తల్లి



దర్శి : శాకంబరీదేవిగా దర్శనం ఇస్తున్న పోలేరమ్మ తల్లి



దర్శి : లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇస్తున్న దద్దాలమ్మ అమ్మవారు



మహాచండీదేవి అలంకరణలో గుంటిగంగమ్మ తల్లి



కురిచేడులో గజలక్ష్మీదేవిగా జ్ఞానప్రసూనాంబదేవి





త్రిపురాంతకంలో కాత్యాయని అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి, వాహనసేవలో పాల్గొన్న భక్తులు

దర్శి: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక కనకదుర్గమ్మతల్లి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా, వాసవీ మాత ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గజలక్ష్మీదేవిగా జ్ఞానప్రసూనాంబదేవి

కురిచేడు: స్థానిక జ్ఞానప్రసూనాంబదేవి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహాచండిగా గంగమ్మ తల్లి

తాళ్లూరు: శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో పూజలందుకున్నారు. తాళ్లూరు, తూర్పుగంగవరంలో వాసవీ మాత మహాచండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తూర్పుగంగవరంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం వద్ద భక్తులు చండీ హోమం నిర్వహించారు. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారిని ఆలయ పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మహాచండిగా అలంకరించారు. ఆలయ ఈఓ జి.వాసు, చైర్మన్ కె.గురుబ్రహ్మం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నపూర్ణదేవిగా ఈశ్వరంబ

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో ఈశ్వరంబ అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమించారు. అర్చకుడు మణిబాబుశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు జ్ఞాన సరస్వతీదేవిగా దర్శనమిస్తారని భైరవానంద స్వామి తెలిపారు. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన తాండవ లక్ష్మయ్య, రంగలక్ష్మి దంపతులు అన్న సంతర్పణ చేశారు.

జగజ్జననికి భక్త నీరాజనం

పెద్దదోర్నాల: దసరా నవరాత్రులు పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత అమ్మవారిని శారదాపరమేశ్వరీ దేవిగా అలంకరించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు.

విజయలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి

పెద్దారవీడు: శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లె గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొబ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు భవానిప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి పంచామృతం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఎదురుగా ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

మహాచండీదేవిగా అమ్మవారు

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామంలో వేంచేసి ఉన్న రేణుక ఎల్లమ్మ దేవత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఏడో రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారు మహాచండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజారి భరద్వాజ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్న సంతర్పన చేశారు.

పార్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి

యర్రగొండపాలెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం ఆదిత్య హృదయం పారాయణం, రాత్రి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత కొప్పుకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు మహాచండి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

అమ్మవారికి 108 నైవేద్యాల సమర్పణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కొప్పుకొండ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి 108 మంది మహిళా భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు 108 రకాల నైవేద్య ప్రసాదాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో మహిళా భక్తులకు నిర్వాహకులు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

త్రిపురాంతకం: దసర శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయని అలంకారంలో సింహవాహనంపై దర్శనమిచ్చారు. సింహవాహన సేవను భక్తులు వైభవంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దొనకొండలో పూజలు చేస్తున్న భక్తులు



పెద్దదోర్నాలలో శారదాపరమేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవారు



మహాచండీదేవిగా శ్రీరేణుక ఎల్లమ్మ దేవత



రాజంపల్లిలో ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పక్షవాతం బాధితుడికి ఆర్థిక సహాయం



కొండయ్యకు నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దొనకొండ: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కటారు కొండయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయనను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి 20 రోజుల క్రితం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం బూచేపల్లి శివప్రసాదరెడ్డి పంపించిన రూ.10 వేల నగదును కొండయ్యకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ గొంగటి వెంకసుబ్బమ్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామగిరి హుస్సేన్, కప్పురం హర్షవర్ధనరెడ్డి, కొండెబోయిన ఆదినారాయణ, మురికిపూడి యోసోబు, పత్తి వెంకటసుబ్బయ్య, కోణంగి కోటేష్, మురికిపూడి నాగయ్య, రాచగొర్ల సుబ్బయ్య, మురికిపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కురిచేడు: రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం దర్శి రోడ్డులోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. దర్శి మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన రాచపూడి ప్రభుకిరణ్ తన అన్న వివాహ వేడుకకు సంబంధించి పెళ్లి కుమార్తెకు అవసరమైన సామగ్రిని తీసుకుని అలవలపాడు గ్రామం వెళ్లాడు. అక్కడ నుంచి బైక్‌పై కురిచేడు వస్తుండగా మార్గమధ్యంలో అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొట్టాడు. కుక్క అక్కడికక్కడే మృతిచెందగా ప్రభుకిరణ్ తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

యర్రగొండపాలెం: స్థానిక తిరుమలగిరి కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో జూదం ఆడుతున్న ఇంటిపై దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.1,580 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

దర్శి: భగత్ సింగ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శివరాజనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే దేశం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు త్యజించిన భగత్‌సింగ్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ.. ఎందరో సమరయోధులు ప్రాణాలొడ్డి తీసుకొచ్చిన స్వాతంత్ర్యాన్ని ప్రస్తుత పాలకులు విస్మరిస్తున్నారని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రైవేటీకరణ ఎక్కువైందని, ప్రభుత్వంగ సంస్థలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి పోరాడాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ పీరా సాహెబ్, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నారాయణరావు, కౌన్సిలర్ బత్తుల తిరుపతయ్య, ట్రెజరర్ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు పంచాయతీ కర్రోల గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుర్రపుసాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.